సాక్షి మంచిర్యాల

శనివారం : 12 : ఆగస్టు : 2023

'ఇళ్ల నంబర్లకు కౌన్సిలర్ ఒత్తిడి'

బెల్లంపల్లి: ఇళ్లు లేకుండానే ఇంటి నంబరు ఇవ్వాలని 19వ వార్డు కౌన్సిలర్ కొమ్ము సురేష్ ఒత్తిడి తెస్తున్నారని మున్సిపల్ రెవెన్యూ అధికారి ఆర్.భుజంగరావ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. రోజువారీ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకున్న ప్రాంతానికి వెళ్లగా ఇల్లే లేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తప్పుడు ఫొటోలు, చిరునామాతో దరఖాస్తు చేసుకుంటే ఇంటి నంబరు కేటాయించడానికి వీలు లేదని స్పష్టం చేశారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించండి

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ విద్యార్థులు అక్టోబర్–2023లో పరీక్షకు ఫీజు చెల్లించాలని డీఈవో యాదయ్య తెలిపారు. ఆన్‌లైన్‌లో www.telanganaopenschool.org లేదా మీసేవలో టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 21నుంచి 30వరకు, రూ.25 ఫైన్‌తో 31నుంచి సెప్టెంబర్ 4వరకు, రూ.50 ఫైన్‌తో సెప్టెంబర్ 5నుంచి 9 వరకు ఫీజు చెల్లింపు గడువు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం

ఉదయం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కేజీబీవీ ఖాళీల భర్తీకి సర్టిఫికేట్ల వెరిఫికేషన్



సర్టిఫికేట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో ఖాళీగా ఉన్నా పోస్టుల భర్తీకి పరీక్ష రాసిన అభ్యర్థుల సర్టిఫికేట్ల పరిశీలన శుక్రవారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించారు. 1:3 నిష్పత్తి ప్రకారం 30 పోస్టులకు గాను 90 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. గురువారం రాత్రి అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. శుక్రవారం డీఈవో కార్యాలయానికి అభ్యర్థులు తరలిరావడంతో కోలాహలంగా మారింది. శనివారం తుది తాత్కాలిక 1:1 నిష్పత్తిలో ఎంపిక జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే మధ్యాహ్నం 2గంటలలోపు డీఈవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికేట్ల పరిశీలనను సెక్టోరల్ అధికారులు హేమలత, చౌదరి పర్యవేక్షించారు.

ప్రభుత్వ తీరుపై బీజేవైఎం అర్ధనగ్న ప్రదర్శన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. బీజేపీ నాయకుల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో తుల ఆంజనేయులు, గుండా ప్రభాకర్, బోయిని దేవేందర్, అమిరిశెట్టి రాజు, బోయిని హరికృష్ణ, పల్లి రాకేశ్, రెన్వా, స్వామిరెడ్డి, రావనవేని శ్రీనివాస్, రెడ్డిమల్ల అశోక్, ప్రదీప్, బింగి సత్యనారాయణ, సూరం సంపత్, విజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్య దిష్టిబొమ్మ శవయాత్ర



దిష్టిబొమ్మతో శవయాత్రలో నాయకులు

బెల్లంపల్లి: ఇద్దరు బీఎస్పీ శ్రేణులపై దాడికి నిరసనగా శుక్రవారం బెల్లంపల్లిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. కాంటా చౌరస్తాలో దహనం చేయడానికి ప్రయత్నించగా వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఎస్పీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు దాసారపు రాజు మాట్లాడుతూ బీఎస్పీ నాయకులు గొర్లపల్లి వరప్రసాద్, జాడి సాగర్‌లపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాదాసి రవీందర్, జోనల్ మహిళా కన్వీనర్ భవానీ, జిల్లా ఇంచార్జీ రాజేష్, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గుణ, పట్టణ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

బదిలీల్లో విచిత్రాలు !

- కొందరికి ఎన్నికల సంఘం ఆదేశాల్లేవ్..
- ఎన్నికల ముందు నచ్చిన చోట పోస్టింగ్
- రాజకీయ పలుకుబడితో ఉత్తర్వుల్లో మార్పులు
- జిల్లాలో అధికారుల బదిలీల్లో పారదర్శకతకు పాతర



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే శాసనసభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలనే ఎన్నికల సంఘం ఆదేశాలనే కొందరు అధికారులు తుంగలో తొక్కుతున్న తీరు చర్చనీయాంశంగా మారుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే వారి బదిలీకి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందులో ఒకే జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, సొంత జిల్లాకు చెందిన అధికారులు ఉంటే వేరే చోటుకు బదిలీ చేయాలి. తహసీల్దార్ స్థాయి అధికారి నుంచి ఆర్డీవో, అదనపు కలెక్టర్ వరకు, పోలీసు శాఖలో ఎస్‌హెచ్‌వో నుంచి ఏసీపీల వరకు బదిలీ చేయాలి. వీరితోపాటు పలు శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమాచారం సైతం సేకరిస్తున్నారు. కొందరు ఈ బదిలీలను రాజకీయ పలుకుబడితో పైరవీలు చేయించుకుని నచ్చిన చోట చేరుతున్నారు. ఇదు అదునుగా ఎన్నికల్లో సాయం చేస్తారనే ఆశతోనూ ప్రజాప్రతినిధులు ఇందుకు ఒకే చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఉత్తర్వులు.. ఆపైనా రద్దు చేస్తూ..

గత జూలై 19న జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మధుసూదన్‌నాయక్‌ను మొదట ఖమ్మంకు, మంచిర్యాల ఆర్డీవో డి.వేణును మహబూబ్‌నగర్(ఐఅండ్‌పీఏడీ శాఖ)కు బదిలీ చేశారు. ఐదు రోజుల తేడాతోనే మరో ఉత్తర్వులు వెలువడ్డాయి. వేణును కుమురంభీం జిల్లాకు అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను ఖమ్మం నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖకు రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు వచ్చాయి.

- గత నెల 28న మంచిర్యాల ఆర్డీవోగా వీ.రాములు, బెల్లంపల్లి ఆర్డీవోగా డి.కొమురయ్యను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ నెల 4న కలెక్టరేట్‌లో ఏవోగా పని చేస్తున్న తహసీల్దార్ కే.సురేష్‌ను పదోన్నతిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూ సేకరణ), ఆర్‌అండ్‌ఆర్, యూనిట్–1 సిద్దిపేటకు బదిలీ చేశారు. అయితే ఆయన అక్కడ చేరలేదు. ఇక్కడ పని చేస్తున్న శ్యామలాదేవి బదిలీ కావడంతో ఆమె స్థానంలో డి.కొమురయ్యను ఆర్డీవోగా నియమించారు. ఈయన కూడా విధుల్లో చేరకముందే మళ్లీ బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడగా తాజాగా ఆయన స్థానంలో సురేష్ వచ్చారు. ఐదు రోజుల వ్యవధిలోనే ఈ నెల 9న బదిలీల ఉత్తర్వులు వచ్చాయి. మూడేళ్ల కంటే ఎక్కువగా జిల్లాలో పని చేసిన అధికారులు ఉండొద్దనే నిబంధనలు ఉన్నా ఉత్తర్వులు వెలువడడం గమనార్హం.
- మంచిర్యాల ఆర్డీవోగా మొదట శకుంతలను నియమించారు. మళ్లీ ఆమె విధుల్లో చేరకముందే వి.రాములును బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇక జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ.ప్రేమ్‌కుమార్ బదిలీపై పెద్దపల్లికి వెళ్లినప్పటికీ కొంతకాలం జిల్లాకు ఇన్‌చార్జీగా ఉన్నారు.

తహసీల్దార్ల పోస్టింగ్‌ల్లోనూ..

గత నెల 31న జిల్లాలో ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం 18మంది అధికారులను ఇతర జిల్లాలకు, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీ చేశారు. ఇప్పటికీ మూడు చోట్ల విధుల్లో చేరకుండా ఉన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వర్తించే రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) తర్వాత మండలాల్లో కీలకంగా వ్యవహరించే అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు(ఏఆర్వోలు)గా ఉండే తహసీల్దార్లు సైతం మండలాల్లో పోస్టింగ్ కోసం రాజకీయ జోక్యం, పైరవీలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.

కోరిన చోట పోస్టింగ్

ఇక కలెక్టరేట్‌లో మూడేళ్లు పైబడి పలు సెక్షన్లలో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ స్థాయి అధికారులకు ఎన్నికల నియమావళి అడ్డు రావడం లేదు. కొన్నేళ్లుగా భూ వ్యవహారాలు చూస్తూ, అవినీతి కేసుల్లో ఇరుక్కుని, లూప్‌లైన్ పోస్టు పేరుతో అక్కడే తిష్ట వేశారు. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించే కలెక్టర్‌కు సహాయ సహకారాల కోసం ఐదుగురు అధికారుల వరకు తీసుకోవచ్చు. తహసీల్దార్లను డీఏవో, ఏవో, ఇతర సెక్షన్లకు పనులు అప్పగించవచ్చు. దీనిని ఆసరా చేసుకుని జిల్లాలో తమ మూడేళ్ల సర్వీసు పూర్తయి కూడా కొందరు రాజకీయ పలుకుబడితో తాము కోరుకున్న చోట పోస్టింగ్ తెచ్చుకునేలా చక్రం తిప్పుతున్నారు. ఇక పోలీసు శాఖలో ఎస్సై నుంచి ఏసీపీ వరకు స్థానిక ఎమ్మెల్యే సిఫారసు లేఖలతోనే పోస్టింగ్ దక్కుతుందనేది బహిరంగ రహస్యం. వీటి కోసం పోటీపడి మరీ అధికారులు లేఖలు తెచ్చుకుని ఎన్నికలకు ముందు ఎస్సై నుంచి సీఐ, ఏసీపీల వరకు బదిలీలు చేసుకున్నారు.

వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి విప్ వినతిపత్రం

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో ఏడు వంతెనల నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆ శాఖ ఈఎన్సీ రవీందర్‌రావులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ జైపూర్ మండలం టేకుమట్ల వంతెనకు రూ.10 కోట్లు, కుందారం బ్రిడ్జికి రూ.4 కోట్లు, కిష్టాపూర్ బ్రిడ్జికి రూ.4 కోట్లు, కోటపల్లి మండలం లింగన్నపేట వంతెనకు రూ.4 కోట్లు, మందమర్రి మండలం పొన్నారం బ్రిడ్జికి రూ.5.50 కోట్లు, చిర్రకుంట వంతెనకు రూ.2 కోట్లు, భీమారం మండలం నర్సింగపూర్ వద్ద బ్రిడ్జికి రూ.2.50 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ఆర్డీవో సురేష్ బాధ్యతల స్వీకరణ



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఆర్డీవో

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్డీవోగా నియామకమైన కాసబోయిన సురేష్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మధ్యాహ్నం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించి హాజరు రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయనకు డీఏఓ మధుసూదన్, బెల్లంపల్లి తహసీల్దార్ సుధాకర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లోని ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జీజీహెచ్‌కు రోగుల తాకిడి



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో వైద్యం కోసం వచ్చిన ప్రజలు

- భారీగా పెరిగిన ఓపీ సంఖ్య
- ఇరుకైన భవనంలో ఇబ్బందులు
- ఎక్స్‌రేకు రోజంతా ఎదురుచూపులే..

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి రోగుల తాకిడి భారీగా పెరిగింది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ రోజువారీ ఓపీ సంఖ్య 200 నుంచి 400కు చేరింది. గోదావరి నది ఒడ్డున ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని వరదల నేపథ్యంలో ఇటీవల జీజీహెచ్‌కు తరలించిన విషయం తెలిసిందే. దీంతో సాధారణ రోగులతోపాటు గర్భిణులు సైతం ఆస్పత్రికి వస్తున్నారు. ఓపీ చూసే గదుల వద్ద రోగుల రద్దీ ఎక్కువగా, ఆస్పత్రి ఇరుకుగా ఉండడం వల్ల కిక్కిరిసిన జనంతో ఒకరి నుంచి మరొకరికి వ్యాధులు ప్రబలు అవకాశం ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటు తర్వాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి మార్చి అన్ని విభాగాలకు వైద్యులు, సిబ్బందిని నియమించారు. దీంతో మంచిర్యాల, కుమురంభీం జిల్లాలు, మహారాష్ట్ర నుంచి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆస్పత్రిలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

శాంపిళ్లు ఇచ్చేదెలా..?

ఓపీ గదులకు సమీపంలోనే పాథాలజీ ల్యాబ్ ఉంది. సరిపడా ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో రోగులు మూత్ర, రక్త పరీక్షల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. మూత్ర పరీక్షలు చేయించుకునే వారితోపాటు ఔట్‌పేషంట్లు మూత్రశాలలను వినియోగించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ల్యాబ్‌కు సమీపంలోని మూత్రశాలలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఆస్పత్రిలోని బాలింతలు ఉండే వార్డు సమీపంలోని మూత్రశాలలను కొన్నాళ్లు వినియోగించారు. అందులోని నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పైపులు మార్చాల్సి ఉండడంతో మూసేశారు. పైవార్డుల్లో ఉండే మూత్రశాలలకు రోగులు వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రి బయట మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూత్రశాలలకు డబ్బులు ఇచ్చి వినియోగిస్తున్నారు. మూత్రం శాంపిళ్లను దూరంగా ఉండే చోటు నుంచి తీసుకురావడం రోగులకు ఇబ్బందిగా మారుతోంది.

ఆసుపత్రి భవనం సరిపోవడం లేదు



జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన భవనంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ కష్టంగా మారింది. రోగుల తాకిడి పెరగడం, ఇటీవల మాతాశిశు ఆరోగ్య కేంద్రం వరదల నేపథ్యంలో జీజీహెచ్‌కు తరలించడంతో ఆస్పత్రి ఇరుకుగా మారింది. పాత భవనం కావడం, మూత్రశాలల నుంచి నీరు బయటకు వెళ్లకపోవడంతో ఇటీవల మరమ్మతులు చేయిస్తున్నాం. సీజనల్ వ్యాధులు పెరగడం వల్ల రోగుల తాకిడి ఎక్కువైంది. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– డాక్టర్ హరీశ్‌చందర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఎక్స్‌రే కోసం పడిగాపులే

ఓపీ, ఆస్పత్రిలో ఆర్థో సంబంధిత వైద్యం పొందుతున్న రోగులు ఎక్స్‌రే కోసం రోజంతా వేచి చూడాల్సి వస్తోంది. ఇద్దరు రేడియోగ్రాఫర్లు, ఒక టెక్నీషియన్, ఇద్దరు డార్క్ రూం అసిస్టెంట్లు, ఎక్స్‌రేల వివరాల కంప్యూటరీకరణకు ఆపరేటర్ ఉండాల్సింది. కానీ ఒక్కరే టెక్నీషియన్, ఒక డార్క్ రూం అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. రెండు ఎక్స్‌రే మిషన్లు ఉన్నా ఒకటే పని చేస్తోంది. ప్రతీ రోజు 70కి పైగా ఎక్స్‌రేలు తీస్తుంటారు. ఒక్కో ఎక్స్‌రేకు కనీసం 20నిమిషాలకు పైగా సమయం తీసుకుంటోంది. వైద్యులు మధ్యాహ్నం 12గంటల వరకే ఉండడం వల్ల ఆ తర్వాత రిపోర్టులు వచ్చిన వారు మరుసటి రోజు చూపించాల్సి వస్తోంది. దీంతో దూరప్రాంత రోగులు వరుసగా రెండ్రోజులు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉండడం, వైద్యుల సంఖ్య పెరిగినా, సరైన సమయంలో సేవలు అందక రోగులతోపాటు సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలోనే నూతనంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఇటీవల సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటివరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఈ భవనం పూర్తయి అందుబాటులోకి వస్తే సౌకర్యాలతోపాటు రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందే అవకాశం ఉంది.



ఎక్స్‌రే ల్యాబ్‌లో వేచి ఉన్న రోగులు

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు
- రూ.లక్ష సాయం చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నస్పూర్: రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తో కలిసి వెనుకబడిన తరగతుల కులవృత్తుల వారికి రూ.లక్ష సహాయం పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు సైతం ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనే సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వివరించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 2,668 మంది అర్హులైన లబ్ధిదారులు ఈ పథకానికి ఎంపికైనట్లు తెలిపారు. మొదటి విడత నియోజకవర్గంలోని 300 మంది చొప్పున లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ కమిషనర్లు మారుతిప్రసాద్, రమేశ్, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌లు పెంట రాజయ్య, ఈసంపల్లి ప్రభాకర్, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ఏడుగురు జేపీఎస్‌లకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు



కలెక్టర్, ఎమ్మెల్యేతో ఉత్తర్వులు అందుకున్న జేపీఎస్‌లు

మంచిర్యాలఅగ్రికల్చర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉద్యోగంలో కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్ సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఏడుగురికి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 218 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉండగా జిల్లా పెర్ఫార్మెన్స్ కమిటీ ద్వారా 116 మందిని క్రమబద్ధీకరణకు సిఫారసు చేయగా ఏడుగురికి ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. పి.హారిక(హాజీపూర్), ఎస్.శ్వేత(చెల్లాయ్‌పేట), జి.రాజేష్(కొత్తూర్), ఎస్.శ్రీనివాస్(రేండ్లగూడ), కే.ప్రశాంత్(వెంకటాపూర్), పి.మల్లేశ్(గుడిపేట), కే.ప్రదీప్(రంగపేట్)లకు ప్రస్తుతం పని చేస్తున్న గ్రామాల్లో తిరిగి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓలు ప్రభాకర్ రావు, ఫణీందర్‌రావు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, డీపీఓ కార్యాలయాధికారి ప్రజ్ఞ పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షణ్ బృందం పర్యటన

నస్పూర్: స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల పరిశీలనకు కేంద్ర కమిటీ సభ్యులు జిల్లాకు వచ్చారని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ తెలిపారు. శుక్రవారం కేంద్ర కమిటీ సభ్యులు కలెక్టరేట్‌లో కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాలను కేంద్ర కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, సిబ్బంది పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. శుక్రవారం భీమారం మండలం పోలంపల్లి, ఖాజీపల్లి, బెల్లంపల్లి మండలం బూదకలాన్, పెర్కపల్లి గ్రామ పంచాయతీలను సందర్శించారని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, డీపీవో డి.వెంకటేశ్వర్‌రావు, బెల్లంపల్లి డివిజనల్ అధికారి ఏ.ఫణీందర్ పాల్గొన్నారు.

రోడ్లపైనే దర్‘బార్’

- వైన్స్‌ల ఎదుట మందుబాబుల హల్‌చల్
- రాకపోకలకు మహిళలకు ఇబ్బందులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో వైన్స్‌ల ఎదుట ఉన్న ప్రాంతాలు దర్‘బార్’గా మారుతున్నాయి. మందుబాబులు వైన్స్‌ల ఎదుట ఇష్టారీతిగా వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బజారు ఏరియా, పాత బస్టాండ్ ఏరియాల్లోని బ్రాందీ షాపులతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మూసివేతకు గురైన రామాటాకీసు పక్కన ఉన్న కిరాణా దుకాణాలకు వెళ్లే మహిళలు, ఇతర బస్తీలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అత్యధికంగా ఆ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడు చూసినా ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. సరిగ్గా అదే మార్గాన్ని ఆనుకుని బ్రాందీ షాపు ఉంది. పక్కనే పర్మిట్ రూమ్ ఉంది. మద్యంప్రియులు పదుల సంఖ్యలో రోడ్డుపైనే బహిరంగంగా మద్యం తాగి కబుర్లలో మునిగి పోతారు. మద్యం కొనుగోలుకు వచ్చే వారు రోడ్డుపై బైక్‌లను పార్కింగ్ చేస్తుంటారు. దీంతో సరుకుల కొనుగోలు కోసం ఆ మార్గంలో వెళ్లే మహిళలు, బాలికలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొందరు ఆకతాయిలు, మద్యంప్రియులు మహిళలను ఈవ్‌టీజింగ్ చేస్తుంటారు. ఇబ్బందులపై కాంట్రాక్టర్ బస్తీ వాసులు, కిరాణా దుకాణాల నిర్వాహకులు ఎక్సైజ్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. పాత బస్టాండ్ వద్ద రోడ్డు పక్కనే ఉన్న మరో బ్రాందీ షాపు సైతం రాకపోకలకు అడ్డంకిగా మారింది. కొందరు మద్యంమత్తులో రోడ్డుపై గొడవ పడుతుండడంతో మహిళలు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. తాళ్లగురిజాల పెట్రోల్ బంక్ వద్ద ఉన్న మద్యం దుకాణం కూడా ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. షాపు పక్కన పర్మిట్ రూమ్ ఉన్నా అనేకమంది రోడ్డుపైకి వచ్చి మద్యం తాగుతుంటారు. కొందరు వెకిలి చేష్టలతో వాహనాలపై వెళ్తున్న మహిళలను చూసి ఇబ్బంది కలిగిస్తున్న ఘటనలు కూడా జరుగుతున్నాయి.

నస్పూర్‌లో 'మామూలే'

నస్పూర్: పట్టణ పరిధిలోని తొమ్మిది మద్యం దుకాణాలు, నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఏ ఒక్క దుకాణానికి కూడా పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో మద్యంప్రియులు తమ వాహనాలను రోడ్లపైనే గంటల తరబడి నిలిపి వేసి దుకాణాల్లో మద్యం సేవిస్తుంటారు. దీంతో రోడ్లపైన వెళ్లే మహిళలు, స్కూల్ విద్యార్థులు, స్కూల్ బస్సులకు ఇబ్బందులు తప్పడం లేదు. మద్యంషాపులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం పది నుంచి రాత్రి పది గంటల వరకే తెరిచి ఉండాల్సిన వైన్‌షాపులు రాత్రి పదకొండు గంటలు దాటిన తర్వాత కూడా తెరిచి ఉంటున్నాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉండాల్సిన బార్ అండ్ రెస్టారెంట్లు రాత్రి 12 గంటలు దాటిన తర్వాత కూడా యథేచ్ఛగా నిర్వహించడం పరిపాటిగా మారింది. రాయల్ థియేటర్ వద్ద మద్యంషాపులు పాఠశాలలకు సమీపంలో ఉండడంతో లంచ్ సమయంలో విద్యార్థులకు లంచ్ తీసుకెళ్లడం తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా మారింది. పాఠశాల నుంచి తిరిగి ఇంటికి తిరిగి వెళ్లే విద్యార్థులు సైతం మందుబాబులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



బెల్లంపల్లి: రామాటాకీసు గల్లీకి వెళ్లే మార్గంలో..



నస్పూర్: ఓ మద్యం దుకాణం ఎదుట వాహనాలు

క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధుడు చొక్కారెడ్డి కన్నుమూత


బద్దం చొక్కారెడ్డి (ఫైల్)

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బద్దం చొక్కారెడ్డి (97) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. చొక్కారెడ్డి నిజాం కాలంలో తెలుగు ప్రజలపై జరుగుతున్న అరాచకాలను అప్పటి కాంగ్రెస్ నాయకుడు కేశవరావు నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లి అప్పటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు వివరించారు. వెంటనే పటేల్ మిలిటరీని తెలంగాణకు పంపించి అరాచకాలను అణిచివేశారు. చొక్కారెడ్డి భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు నలుగురు కూతుళ్లు, కుమారుడు వెంకట్ రెడ్డి ఉన్నారు.

కోర్టు కేసులపై సమీక్ష


సమావేశంలో డీజీఎం, అధికారులు

నస్పూర్: సింగరేణి సంస్థలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన వివరాలపై డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎస్.బలరాం, జనరల్ మేనేజర్ పర్సనల్ హనుమంతరావు అన్ని ఏరియాల పర్సనల్, లా విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ.. న్యాయ స్థానంలో ఉన్న కేసులకు సంబంధించిన అన్ని వివరాలను సంస్థ తరఫున న్యాయ స్థానాలకు అందించాలని అధికారులకు సూచించారు. డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీవైపీఎంలు ఎస్వీ రాజేశ్వర్‌రావు, వీ దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సంక్షేమాధికారులు సునీల్, రణదీప్ గౌడ్, గౌస్ పాషా, సంతన్ పాల్గొన్నారు.

14న అప్రెంటిషిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14న నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్-50 ఖాళీలు, మెషినిస్టు-10, టర్నర్ ట్రేడ్‌లో 10 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. వీఎల్ఆర్ ఫెసిలిటేటర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఎలక్ట్రీషియన్-40, ఫిట్టర్-60, వెల్డర్-60, మెకానిక్ డీజిల్-30 ఖాళీలున్నట్లు తెలిపారు. ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్-50 ఖాళీలు, ఐటీసీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, మెదక్‌లో (మహిళలకు) కోపా-30 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో 370 ఖాళీలున్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు అప్రెటింషిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలతో ఎన్టీసీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్, రెండు ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.

పత్తికి సూక్ష్మ పోషకాలు తప్పనిసరి

- చెన్నూర్ ఏడీఏ జాడి బాపు

చెన్నూర్‌రూరల్: పత్తి పంటకు అందించే ప్రధాన మూలకాలు లేదా పోషకాలు నత్రజని (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్), పాస్పరస్ (పీ) (సింగిల్ పాస్పేట్, డీఏపీ, కాంప్లెక్స్), పొటాష్ (మ్యూరేట్ ఆఫ్ పొటాష్, మల్టికె, కాంప్లెక్స్)తో పాటు మొక్కల ఎదుగుదల, కాయల అభివృద్ధి, పత్తి నాణ్యత, దిగుబడి పెరగడానికి, జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మ పోషకాలు అవసరమని చెన్నూర్ ఏడీఏ జాడి బాపు సూచించారు. ఆయన చేస్తున్న మరిన్ని సూచనలు..

జింక్: విత్తిన మూడు వారాల తర్వాత పత్తిలో జింక్ లోపం కనబడుతుంది. ఇది ఎక్కువగా మొక్క మధ్య ఆకుల మీద కనిపిస్తుంది. ఆకుల ఈనెలు, ఆకు పచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. గోధుమరంగు మచ్చలు ఆకుల చివర్ల నుంచి మొదలుకు వ్యాపిస్తాయి. ఆకు చివర్లు ఎండిపోతాయి. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్యదూరం తగ్గి పోతుంది. మొక్కలు చిన్నవిగా గుబురుగా కనబడుతాయి.

నివారణ చర్యలు: జింక్ లోపం లేకుండా ఉండేందుకు ఆఖరి దమ్ములో ఎకరాకు 20కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి.


జింక్ లోపంతో గోధుమ వర్ణంలో పత్తి ఆకులు

బోరాన్: మొక్క జీవనక్రియలో బోరాన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మొక్కలో సున్నం, పొటాష్ పోషకాలను క్రమబద్ధీకరిస్తుంది. మొక్క సున్నాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి బోరాన్ అవసరం ఉంటుంది. సున్నం పాటు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షపాతం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుంది. ఆకులు, కాడలు ఒకే రీతిలో ఉండకుండా కొంత దళసరిగా, కొంత పలుచగా ఉండి అక్కడక్కడా గుండ్రటి మచ్చలు ఏర్పడతాయి. పూత, మొగ్గ దశలో ఎండి పోవడం, చిన్నకాయలు రాలి పోవడం మొక్కలు గిడసబారి మొదలుపై పగుళ్లు ఏర్పడతాయి. కాండం సరిగా అభివృద్ధి చెందక ఆకారం కోల్పోయి, నిలువుగా పగుళ్లు ఏర్పడతాయి.


బోరాన్ లోపంతో పత్తి ఆకులు ఇలా..


జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

నివారణ చర్యలు: బోరాన్ లోపించకుండా ఉండేందుకు ఎకరాకు నాలుగు కిలోల బోరాక్స్‌ను దుక్కిలో వేయాలి. బోరాన్ లోపం మొక్కలపై కనిపిస్తే పైరు విత్తిన 60, 90 రోజుల తర్వాత లీటర్ నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ వారం వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి.

మెగ్నీషియం: ఈ దాతువు యొక్క లోపం ఎక్కువగా సున్నపు నేలలు, పొటాష్ ఎక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలో కనబడుతుంది. మెగ్నీషియం లోపం పత్తి పంటలో ఎక్కువగా కనిపిస్తుంది. మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు ముదురుఆకులు అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ చర్యలు: మెగ్నీషియం లోపిస్తే లీటర్ నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45, 75 రోజులకోసారి పిచికారీ చేయాలి. ప్రధాన పోషకాలు నత్రజని, పాస్పరస్, పొటాష్‌ను రైతులు ఏదో ఒక రూపంలో అందించాల్సిన దాని కంటే ఎక్కువ మోతాదులో వాడుతున్నారు. ఈ సూక్ష్మ పోషకాల ఆవశ్యకత తెలియక వాటిని వాడడం లేదు. అందుకే రైతులు సూక్ష్మ పోషకాలకు సంబంధించిన లక్షణాలు ఉండే పురుగుమందులు వాడుతుంటారు. రైతులు వారిస్థాయిలో లోపాల లక్షణాలను గుర్తించి అన్ని ఎరువులు సమపాళ్లలో వాడుకోవాలి. దీంతో పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుంది.

టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం యాజమాన్యం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించాలని టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసారపు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఏరియాలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు సింగరేణి ఆస్తులు దోచుకుంటున్నా సింగరేణి యాజమాన్యం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నోరు మెదపడం లేదని ఆరోపించారు. మందమర్రి ఏరియాలో కార్మికులకు నివాస యోగ్యంగా ఉన్న క్వార్టర్లను గుర్తించిన తర్వాతే డిజిటలైజేషన్ చేయాలని కోరారు. మిగులు క్వార్టర్లను కబ్జాకు గురికాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు నిబంధనల ప్రకారం కేటాయించాలన్నారు. అక్రమ నిర్మాణాలకు తావివ్వకుండా ప్రజలు, ఉద్యోగులను భాగస్వాములను చేసి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. మొదటి జూన్‌లో ఇటీవల అక్రమ నిర్మాణం చేస్తున్నారని రమేశ్ అనే వ్యక్తి అక్కడ లేకుండానే ఫిర్యాదు చేయడంపై అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాన్ని స్వాధీనం చేసుకోవాలని, నిర్మాణదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శ్రావణ్, సాయికుమార్, లింగం, నవీన్, రాకేశ్, భాస్కర్, మహేశ్ ఉన్నారు.

గూడెం గుట్టల్లో అక్రమ తవ్వకాలు!


తవ్వకాలు జరిపిన ప్రదేశం

- పేలుళ్లతో భయాందోళనలో గ్రామస్తులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ సమీపంలోని గుట్టల్లో మొరం అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్ శాఖలనుంచి ఎలాంటి అనుమతి లేకుండానే కొందరు తవ్వకాలు చేపడుతున్నారు. గూడెం గుట్టల్లో కొంత భాగం తవ్వకాలకు అనుమతి ఉండగా, మిగతా చోట్ల అనుమతి లేనప్పటికీ జేసీబీలతో దర్జాగా తవ్వకాలు కొనసాగిస్తున్నారు. అక్రమ తవ్వకాలతో గూడెం గుట్టలు కనుమరుగవుతున్నాయి. స్థానికంగా ఉండే కొందరు రాత్రి, పగలూ తేడా లేకుండా తవ్వకాలు చేపట్టి టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌లకు పాల్పడుతుండగా సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ మొరం తవ్వకాలు, బ్లాసిటింగ్‌లను నిలిపివేయాలని కోరుతున్నారు.

ఎలాంటి అనుమతులు లేవు

గూడెం గుట్టల్లో క్వారీ తవ్వకాలకు మాత్రమే అనుమతులున్నాయి. మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు ఇటీవలే మా దృష్టికి వచ్చింది. మా సిబ్బందితో పర్యవేక్షిస్తున్నాం. మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అనుమతులు లేకుండా మొరం, క్వారీ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు.

– బాలు, మైనింగ్ ఏడీ

తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

దండేపల్లి మండలంలోని గూడెం గుట్టల్లో అక్రమంగా, క్వారీ, మొరం తవ్వకాలు జరపడంతోపాటు బ్లాస్టింగ్ చేస్తున్నారని స్థానికులు తహసీల్దార్ సంధ్యారాణికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. బ్లాస్టింగ్‌లు చేపట్టడంతో సమీపంలోని తమ పొలాలకు వెళ్లలేకపోతున్నామని తెలిపారు. వెంటనే అక్రమ తవ్వకాలు, బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దమ్మ సృజన్, సునీల్, మాజీ జెడ్పీటీసీ మంద రాజయ్య, స్థానికులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో బుద్దే స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న దేశీదారును పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్‌వో బుద్దే స్వామి శుక్రవారం కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై కళ్యాణ్ సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం రైల్వేస్టేషన్ రోడ్డులో రెండు ద్విచక్రవాహనాల్లో చంద్రపూర్‌కు చెందిన అజయ్‌కుమార్, రోహిత్, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విశాల్, ఆకాష్ మహారాష్ట్ర నుంచి అక్రమంగా 1150 దేశీదారు సీసాలు తీసుకువస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40,250 ఉంటుందని పేర్కొన్నారు. నాటుసారా, గుడుంబా, దేశీదారు, గంజాయి ఇతర మత్తుపానీయాలు అమ్మినా, తయారు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశీదారు తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మందమర్రిరూరల్: మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ అంతరాయమేర్పడింది. రైల్వే గేటు సమీపంలో వెదురు బొంగులతో వెళ్లే లారీ రోడ్డుపై నిలిచిపోగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. ట్రాఫిక్‌లో మూడు అంబులెన్స్‌లు కూడా చిక్కుకుపోయాయి. మందమర్రి పోలీసులు వెంటనే అక్కడకు వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పంచాయతీ ట్రాక్టర్‌ను లాక్కెళ్లిన కాంట్రాక్టర్

- సీసీ రోడ్డు బిల్లు చెల్లించకపోవడంతోనే..


కాంట్రాక్టర్ ఇంటి వద్ద గ్రామపంచాయతీ ట్రాక్టర్

బెజ్జూర్: సీసీ రోడ్డు పనులు చేసి నెలలు గడిచినా బిల్లు రాకపోవడంతో ఓ కాంట్రాక్టర్ ఏకంగా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను లాక్కెళ్లిన ఘటన మండలంలోని లంబాడిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. లంబాడిగూడ గ్రామ పంచాయతీకి చెందిన ముడిమడుగుల పెంటయ్య కొద్దినెలల క్రితం దాదాపు రూ.5 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మించాడు. మూడు నెలలవుతున్నా బిల్లు రాలేదు. పలుసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను గురువారం లాక్కెళ్లి ఇంటి ముందు పెట్టుకున్నాడు. బిల్లు చెల్లించేదాకా ట్రాక్టర్‌ను ఇచ్చేది లేదని చెబుతున్నాడు. తాను నిర్మించిన సీసీ రోడ్డు బిల్లు సర్పంచ్ ఖాతాలో జమ కాగా తనకు ఇవ్వడంలేదని ఆరోపించాడు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నాడు.

కలెక్టరేట్‌కు మారిన సంక్షేమశాఖ కార్యాలయం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా నిర్వహిస్తున్న మహిళా, శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సమీకృత కలెక్టరేట్‌లోకి శుక్రవారం మార్చారు. గదిలో పూజలు నిర్వహించి పాత కార్యాలయంలోని సామగ్రి, కంప్యూటర్లను తరలించి సేవలు ప్రారంభించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కె.రఘువీర్, పోషణ అభియాన్ టీం రజిత, చైల్డ్‌లైన్ సత్యనారాయణ, డీఈవో రాజ్యలక్ష్మి, ఎఫ్ఆర్‌వో ఫర్జాన, లక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

శరణ్య హంతకుడెవరు?

మంచిర్యాలక్రైం: ఈ నెల 10న జిల్లా కేంద్రంలో బత్తిని శరణ్య (27)ను అతి కిరాతకంగా హత్య చేసేంది ఎవరనేది మిస్టరీగా మిగిలింది. హత్య జరిగిన 24గంటల వరకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. పక్కా పథకం ప్రకారమే హత్య చేసి ఆధారాలు దొరకకుండా చేశారు. కుటుంబ సభ్యులు మాత్రం మృతురాలి భర్త సయ్యద్ జియా ఉల్ హక్ మరొకరి సాయంతో హత్య చేశాడని ఆరోపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సయ్యద్ కోసం వేట మొదలుపెట్టారు. సయ్యద్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చెన్నై ప్రాంతంలోని మధురైలో విధులు నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు ప్రత్యేక పోలీస్ టీమ్ అక్కడికి బయలుదేరినట్లు సమాచారం. కాగా, స్థానికంగా అనుమానితులను కొందరిని విచారిస్తున్నట్లు తెలిసింది. శరణ్య హత్యకు ఎవరు సహకరించి ఉంటారనే కోణంలో విచారణ చేస్తున్నారు. భర్తనే హత్య చేశాడా? లేక ఎవరికైనా సుఫారీ ఇచ్చి హత్య చేయించాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. మృతురాలి కాల్ డాటా ఆధారంగా కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉంది. ఏది ఏమైనా మహిళ హత్య కేసు ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

మందమర్రిరూరల్: ఈ నెల 9న మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో జరిగిన గుంటి మాధవి హత్య కేసులో ఆమె భర్త దేవేందర్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి మండలం మాల గురిజాలకు చెందిన మాధవి 2007లో మొదటి భర్తను విడిచి మందమర్రికి చెందిన దేవేందర్‌ను రెండో వివాహం చేసుకుంది. తాగుడుకు బానిసైన దేవేందర్ మద్యం మత్తులో మాధవిని కొట్టి చంపాడని ఆమె మొదటి భర్త కుమారుడు అమర్‌నాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశామని ఏసీపీ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సీఆర్టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టీఎస్‌టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమకు వినతిపత్రం అందించారు. నెలలకొద్దీ వేతనాలు పెండింగ్‌లో ఉంచడం వల్ల సీఆర్టీల కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతీ నెలకు సంబంధించిన వేతనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్ల రామన్న, కార్యదర్శి గుర్రాల రాజావేణు, ఉపాధ్యక్షురాలు ఎస్.లావణ్య పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు కన్నాల చౌరస్తా హన్మాన్ విగ్రహం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసే విషయంలో ఘర్షణపడి ఇద్దరు బీఎస్పీ నాయకులపై దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్సై విక్టర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లపల్లి వరప్రసాద్ పార్టీ ప్రచారం కోసం హన్మాన్ విగ్రహ ప్రాంతంలో మున్సిపాలిటీకి రుసుం చెల్లించి ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. ఇదే ఫ్లెక్సీపై బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణాధ్యక్షుడు సన్నీబాబు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. దీంతో సన్నీబాబు అతడి అనుచరులు మరో 20మంది వరప్రసాద్, జాడి సాగర్‌పై దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

కోటపల్లి: మండలంలోని శంకరాపూర్ గ్రామానికి చెందిన సూరం రాంరెడ్డి అనే వ్యక్తి దుర్గం బాపును కొట్టి కట్టేసి కులం పేరుతో దూషించినందుకు బాధితుడి ఫిర్యాదు మేరకు అతడిపై అట్రాసిటీ, వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గం బాపు ఎడ్లు రాంరెడ్డి పెరటిలోని మొక్కజొన్న కర్రలు తిన్నందునా అతడిని ఇంటి నుంచి లాక్కొచ్చి బూతులు తిడుతూ తన ఇంటి వద్ద కట్టివేశాడని పేర్కొన్నారు. గ్రామస్తులు సర్దిచెప్పడంతో బాపును విడిచిపెట్టినట్లు వివరించారు. ఏసీపీ మోహన్, ఎస్సై సురేశ్ సమగ్ర విచారణ జరిపి నేరం రుజువైనందున రాంరెడ్డిపై 73/23, 342, 324,290, ఐపీసీ 3(1), 3(2) ఎస్సీ యాక్ట్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రతీనెల 30వ తేదీన ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సివిల్ రైట్స్‌డే నిర్వహించి ప్రజలకు కులవివక్ష, చట్టాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎదుటివారి హక్కులకు భంగం కలిగించినా, కుల వివక్ష చూపినా, ఇందుకు సహకరించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటి మడుగులో పడి యువకుడి మృతి


ప్రవీణ్ (ఫైల్)

రెబ్బెన: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన జె.ప్రవీణ్(18) శుక్రవారం ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి మృతిచెందాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెల కాపరి ప్రవీణ్ రోజు మాదిరిగానే లక్ష్మీపూర్ వాగు పరిసరాల్లో గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. కొన్ని గొర్రెలు నీటిమడుగులోకి వెళ్లడంతో వాటిని బయటకు తోలేందుకు దిగి ప్రమాదవశాత్తు అందులోనే మునిగిపోయాడు. సమీపంలో ఉన్న మరో గొర్రెల కాపరి గమనించాడు. గ్రామస్తుల సహాయంతో బయటకు తీసి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే చనిపోయాడు. సంఘటన స్థలాన్ని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ కోలే శ్యాంరావు పరిశీలించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మంచిర్యాల టికెట్ బీసీలకే కేటాయించాలి



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఆశావహులు

నస్పూర్: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ బీసీలకే కేటాయించాలని పలువురు బీసీ ఆశావహ అభ్యర్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బీసీ సామాజికవర్గ అభ్యర్థులకే అన్ని ప్రధాన పార్టీలు టికెట్ కేటాయించాలని కోరారు. ఏ పార్టీ టికెట్ కేటాయించినా పార్టీలకు అతీతంగా గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఏ పార్టీ టికెట్ కేటాయించని పక్షంలో తమలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో నస్పూర్, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్లు తోట శ్రీనివాస్, గాజుల ముఖేశ్‌గౌడ్, మంచిర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్, నస్పూర్ మాజీ జెడ్పీటీసీ రాచకొండ ఆశాలత, డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, డాక్టర్ రమణ, బీసీ జిల్లా జాగృతి అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, నాయకులు తులా మధుసూదన్‌రావు, విష్ణువర్ధన్‌రావు, దొమ్మటి అర్జున్, వెంకటేశ్వర్‌రావు, రంగు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు పునరావృత్తం కాకుండా చూడాలి


బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

కోటపల్లి: దళితులపై దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని దళితసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శెట్‌పల్లి గ్రామంలో దళితుడు దుర్గం బాపుపై దాడికి నిరసనగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు జిల్లపెల్లి వెంకటేశం, ఎమ్మార్పీఎస్ నాయకులు, నేతకాని సంఘం నాయకులు దుర్గం అశోక్, దుర్గం రాజేశ్ వేర్వేరుగా పరామర్శించారు. బాధితుడు బాపుతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు కిరణ్, అశోక్, శ్రావణ్, కృష్ణ, బీజేపీ నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, దేవాజీ, రాజు, వెంకటేశ్, విజయ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల సర్వేపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

జైపూర్: గృహలక్ష్మి దరఖాస్తుల ఎంపికలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించే సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో 20 మంది కార్యదర్శులకు వచ్చిన దరఖాస్తులు అప్పగించారు. లబ్ధిదారుల ఎంపిక సర్వేపై డీఆర్డీవో, గృహలక్ష్మి ప్రత్యేకాధికారి శేషాద్రి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.